# సింధు రెండేండ్ల నిరీక్షణ ముగిసేనా?

**నేటి నుంచే సింగపూర్ ఓపెన్ • సాత్విక్-చిరాగ్ జోడీ పునరాగమనం**




సింగపూర్: 'బ్యాడ్మింటన్ సూపర్' టోర్నీ టైటిల్ కోసం రెండేండ్లుగా ఎదురుచూస్తున్న డబుల్ ఒలింపియన్ పీవీ సింధు.. తనకు అచ్చొచ్చిన సింగపూర్ ఓపెన్‌లో మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. మంగళవారం నుంచి సింగపూర్ ఓపెన్ సూపర్ 750 టోర్నీకి తెరలేవనున్న నేపథ్యంలో 2022లో ఇక్కడే విజేతగా నిలిచిన సింధు.. నాటి ప్రదర్శనను పునరావృతం చేయాలని భావిస్తోంది. ఏడాది తర్వాత 'సూపర్' సిరీస్ ఫైనల్ చేరిన సింధు.. మలేషియా మాస్టర్స్‌లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. పారిస్ ఒలింపిక్స్‌కు ముందు సింధుకు ఈ టోర్నీ చాలా కీలకం. తొలి రౌండ్‌లో భాగంగా బుధవారం ఆమె.. డానిష్ షట్లర్ లినెతో పోటీ పడనుంది. మహిళల విభాగంలో సింధుతో పాటు ఆకర్షి కశ్యప్, డబుల్స్‌లో అశ్విని-తనీషా బరిలో ఉన్నారు. పురుషుల సింగిల్స్ విభాగంలో లక్ష్యసేన్, ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్ సత్తాచాటాలని భావిస్తున్నారు. పురుషుల డబుల్స్‌లో స్టార్ షట్లర్లు సాత్విక్- చిరాగ్ స్వల్ప విరామం తర్వాత మళ్లీ కోర్టులోకి అడుగుపెట్టనున్నారు. ఇటీవలే థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచి తిరిగి ప్రపంచ నంబర్‌వన్ స్థానం దక్కించుకున్న భారత ద్వయం ఇక్కడా మెరిసేందుకు సిద్ధమయ్యారు. విశ్వక్రీడలకు సన్నద్ధమవుతున్న భారత షట్లర్లకు సింగపూర్ ఓపెన్ మంచి సన్నాహకంగా మారనుంది.

# ఉప్పల్ స్టేడియంకు ఐపీఎల్ అవార్డు




న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)లో అత్యుత్తమ పిచ్, మైదానం అవార్డును హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ)కు చెందిన ఉప్పల్ క్రికెట్ స్టేడియం కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఐపీఎల్ ఫైనల్ ముగింపు కార్యక్రమంలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వరీనాథ్ చేతుల మీదుగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు అవార్డు స్వీకరించారు. దీంతో పాటు హెచ్‌సీఏకు రూ.50లక్షల నగదు ప్రోత్సాహం లభించింది. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ 'ఐపీఎల్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించేందుకు కార్యదర్శి దేవరాజ్‌తో పాటు ఇతర అపెక్స్ కౌన్సిల్ సభ్యులు, హెచ్‌సీఏ సిబ్బంది అహర్నిశలు శ్రమించారు. ముఖ్యంగా చీఫ్ క్యూరేటర్ చంద్రశేఖర్, ఇతర గ్రౌండ్స్‌మెన్ చాలా కష్టపడ్డారు. ఈ అవార్డు హెచ్‌సీఏ కుటుంబ సభ్యుల శ్రమకు ప్రతిఫలం' అని అన్నారు. ఇదిలా ఉంటే లీగ్ మొత్తంగా అద్భుతమైన పిచ్‌లు తయారు చేసిన పది వేదికలకు చెందిన క్యూరేటర్స్, గ్రౌండ్స్‌మెన్‌కు 25లక్షల చొప్పున బీసీసీఐ కార్యదర్శి జై షా నగదు ప్రోత్సాహం ప్రకటించారు.

# ఉజ్బెకిస్థాన్ టోర్నీకి సౌమ్య




న్యూఢిల్లీ: తాష్కెంట్ వేదికగా ఉజ్బెకిస్థాన్‌తో జరిగే అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌ల కోసం భారత మహిళల జట్టును సోమవారం ప్రకటించారు. మొత్తం 23 మందితో కూడిన జాతీయ జట్టులో తెలంగాణ యువ ఫుట్‌బాలర్ గుగులోతు సౌమ్య చోటు దక్కించుకుంది. ఈ నెల 31, జూన్ 4వ తేదీన భారత్, ఉజ్బెకిస్థాన్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందుకోసం హైదరాబాద్‌లోని శ్రీనిధి దక్కన్ ఎరీనాలో 30 మందితో కూడిన మహిళల టీమ్ సన్నాహక శిబిరంలో పాల్గొంది. టోర్నీ కోసం బుధవారం భారత జట్టును ఉజ్బెకిస్థాన్ బయల్దేరి వెళ్లనుంది.



# ప్రిక్వార్టర్స్‌కు అంకుషిత

బ్యాంకాక్: పారిస్ ఒలింపిక్స్‌లో బెర్తులు నిర్ణయించే ప్రపంచ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో సోమవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా మహిళల 60 కిలోల విభాగంలో అస్సోం యువ సంచలనం అంకుశిత బోరో 4-1 తేడాతో నమున్ మొంఖోర్ (మంగోలియా)ను ఓడించి ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఆది నుంచే ప్రత్యర్థిపై పదునైన పంచ్‌లతో విరుచుకుపడ్డ అంకుశిత తదుపరి రౌండ్‌కు అర్హత సాధించింది. పురుషుల 80 కిలోల విభాగంలో పోటీపడ్డ అభిమన్యు లోరాకు నిరాశే ఎదురైంది.

# వన్డే ఫార్మాట్‌కు స్టార్క్ గుడ్‌బై!



చెన్నై: ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఒక ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పనున్నాడా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ఐపీఎల్-17 ఫైనల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయంలో కీలకపాత్ర పోషించిన స్టార్క్.. త్వరలోనే 50 ఓవర్ల ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పే అవకాశమున్నట్టు చెప్పకనే చెప్పాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఫైనల్ ముగిసిన తర్వాత స్టార్క్ మాట్లాడుతూ.. 'గత తొమ్మిదేండ్లలో నేను ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకే అధిక ప్రాధాన్యతనిచ్చాను. సిరీస్‌లు లేనప్పుడు మిగతా సమయాన్ని నా కుటుంబానికి వెచ్చించాను. ఫ్రాంచైజీ క్రికెట్‌లో కొనసాగాలంటే ఏదో ఒక ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పక తప్పదు' అని చెప్పాడు.

# నాదల్ నిష్క్రమణ

**తొలి రౌండ్‌లోనే ముగిసిన పోరాటం • జ్వెరెవ్ చేతిలో అనూహ్య ఓటమి**

**ఫ్రెంచ్ ఓపెన్‌కు పరాజయంతో వీడ్కోలు! • పారిస్ ఒలింపిక్స్ బరిలో స్పెయిన్ బుల్**



**రఫెల్ నాదల్..మట్టికోట మహారాజు! ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ చరిత్రలో నాదల్‌ది ఓ ప్రత్యేక అధ్యాయం. మట్టికోర్టుపై ఆడేందుకే పుట్టాడా అన్న రీతిలో ఎవరికీ సాధ్యం కాని శైలిలో నాదల్ సాగించిన జైత్రయాత్ర మాటలకందనిది. నూనుగు మీసాల వయసు నుంచే ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా నిలిచి ఫ్రెంచ్ ఓపెన్ రారాజుగా మన్ననలు అందుకున్న నాదల్ తన అసమాన పోరాటాన్ని ముగించాడు. గాయం నుంచి తేరుకుని బరిలోకి దిగిన ఈ స్పెయిన్ బుల్ తొలి రౌండ్‌లోనే అనూహ్యంగా నిష్క్రమించాడు. జర్మనీ ప్లేయర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ చేతిలో అనూహ్య ఓటమితో కోర్టు నుంచి భారంగా వైదొలిగాడు. ఆటకు వీడ్కోలు పలుకకపోయినా..పారిస్ ఒలింపిక్స్‌లో మళ్లీ కలుద్దామంటూ అభిమానుల జయజయధ్వానాల మధ్య చెమర్చిన కండ్లతో అభివాదం చేశాడు.**

పారిస్: సుదీర్ఘ టెన్నిస్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని లిఖించుకున్న రఫెల్ నాదల్..తనకు బాగా అచ్చొచ్చిన ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆదిలోనే పోరాటాన్ని ముగించాడు. గాయం నుంచి కోలుకుని బరిలోకి దిగిన నాదల్ స్థాయికి తగ్గ ఆటతీరును కనబర్చలేకపోయాడు. సోమవారం కోర్ట్ ఫిలిప్ చాట్రియర్ వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో నాదల్ 3-6, 6-7(5-7), 3-6తో జర్మనీ స్టార్ ప్లేయర్ అలెగ్జాండర్ జ్వెరెవ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో మకటం లేని మహారాజుగా మన్ననలు అందుకున్న నాదల్..తొలి రౌండ్‌లోనే వైదొలుగడం ఇదే తొలిసారి కావడం విశేషం. గతంలో మూడు సార్లు టైటిల్ దక్కించుకోకుండానే తన పోరాటాన్ని ముగించాడు.15వేల మంది ప్రేక్షకుల సమక్షంలో స్టేడియంలోకి ప్రవేశించిన నాదల్.. తొలిసారి టోర్నీలో 275 ర్యాంక్‌తో అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో 22 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు కైవసం చేసుకున్న ఈ స్పెయిన్ స్టార్ 38 ఏండ్ల వయసులో గాయాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు.

**వరుస సెట్లలో:**

రఫెల్ నాదల్, జ్వెరెవ్ పోరు దాదాపు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. గాయం నుంచి కోలుకున్నా..జ్వెరెవ్‌కు దీటైన పోటీనివ్వడంలో విఫలమైన నాదల్ వరుస సెట్లలో మ్యాచ్‌ను చేజార్చుకున్నాడు. ఆదిలోనే డబుల్ ఫాల్ట్స్ చేసిన నాదల్ పోరుపై పట్టు కోల్పోయాడు. మరోవైపు ఇటీవలే రోమ్ ఓపెన్ గెలిచి మంచి జోరుమీదున్న జ్వెరెవ్..కీలకమైన పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. తొలి సెట్‌లో రెండు బ్రేక్‌పాయింట్లను కాపాడుకుని 3-1తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ క్రమంలో అదే దూకుడు కనబరిచిన ఈ ప్లేయర్ మొదటి సెట్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. రెండో సెట్‌లో పుంజుకుని పోటీలోకి వచ్చిన నాదల్ 4-2తో ఆధిక్యం కనబరిచినా.. జ్వెరెవ్ సెట్‌ను మలుపు తిప్పి వశం చేసుకున్నాడు. కీలకమైన మూడో సెట్‌లోనూ జ్వెరెవ్ 4-3తో ముందంజ వేశాడు. అయితే పట్టు వదలని నాదల్ ఎనిమిదో గేమ్‌లో రెండు బ్రేక్‌పాయింట్లు దక్కించుకున్నా..జ్వెరెవ్ తన అద్భుత ఆటతీరుతో సెట్‌తో పాటు మ్యాచ్‌ను కైవసం చేసుకున్నాడు. మరోవైపు సుమిత్ నాగల్ (భారత్) తొలి రౌండ్‌లో 2-6, 0-6, 6-7(5-7)తో ఖచనోవ్ చేతిలో ఓడాడు.

> మాట్లాడం చాలా కష్టంగా ఉంది. ఇదే చివరిదని మీ అందరి ముందు నిజాయితీగా నేను చెప్పలేకపోతున్నాను. ఇన్నేండ్ల ప్రయాణం ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. వాటిని మాటల్లో వర్ణించడం కష్టంగా అనిపిస్తున్నది. నేను బాగా అభిమానించే ప్రదేశమిది. ఈ అద్భుతమైన మ్యాచ్‌కు కారణమైన సాషాకు కృతజ్ఞతలు. గత రెండేండ్లుగా గాయాలతో సతమతమవుతున్నాను. ఇప్పటికిప్పుడే భవిష్యత్ గురించి చెప్పలేను. ఒలింపిక్స్ కోసం మళ్లీ వస్తాను, అది నన్ను ప్రేరేపిస్తుంది. రోలండ్ గారోస్‌లో మరిచిపోలేని జ్ఞాపకాలు ఉన్నాయి. గుండెలోతుల్లోనుంచి మీ అందరికీ కృతజ్ఞతలు. మళ్లీ కలుస్తానన్న నమ్మకముంది, కానీ నాకు తెలియదు.

**5** — **2010 నుంచి 2014 దాకా వరుసగా ఐదు సార్లూ ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గాడు.** **పురుషుల టెన్నిస్ ఓపెన్ ఎరా చరిత్రలో 20 అత్యుత్తమ గ్రాండ్‌స్లామ్ విజయాల్లో ఐదు నాదల్ సాధించినవే కావడం విశేషం.**

**14** — **ఒక గ్రాండ్ స్లామ్ టోర్నీలో ఏకంగా 14 టైటిళ్లు (ఫ్రెంచ్ ఓపెన్) లిచిన ఏకైక టెన్నిస్ ప్లేయర్**

**112-4** — **రోలండ్ గారోస్‌లో 116 మ్యాచ్‌లు ఆడితే నాదల్ ఓడిపోయినవి 4 మ్యాచ్‌లే. టెన్నిస్ మేజర్ టోర్నీలో ఒక సింగిల్స్ ప్లేయర్‌కు విజయాల శాతం పరంగా ఇదే అత్యుత్తమం. 2009లో రొబిన్ సొదర్లింగ్, 2017, 2020లో జొకోవిచ్, తాజాగా జ్వెరెవ్ (మొత్తంగా ముగ్గురే) మాత్రమే రఫెల్‌ను ఓడించారు.**

## మహారాజు లేని మట్టికోర్టు!

*నమస్తే తెలంగాణ క్రీడావిభాగం*

సుమారు రెండు దశాబ్దాల పాటు ఎర్రమట్టి కోర్టును ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మహారాజు.. ఈ ఏడాది తొలి రౌండ్‌లోనే వెనుదిరగడం తీవ్రంగా నిరాశపరిచేదే అయినా గడిచిన 20 ఏండ్లలో 'ఫ్రెంచ్ ఓపెన్ అంటే నాదల్. నాదల్ అంటే ఫ్రెంచ్ ఓపెన్' అన్న రీతిలో అతడి ఆధిపత్యం సాగింది. 2005లో రోలండ్ గారోస్‌లో మొదలైన ఈ స్పెయిన్ తుఫాను.. గత 15 ఏండ్లలో ఐదు సార్లు (2023లో గాయం కారణంగా తప్పుకోకుంటే 4సార్లే) మాత్రమే ఇతరుల వశమైందంటే ఇక్కడ నాదల్ జోరు ఏ విధంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. 2005 నుంచి 2008, 2010-2014, 2017-2020 మధ్య అతడి దూకుడుకు బ్రేకులు వేసిన ఆటగాళ్లే లేరు. రోజర్ ఫెదరర్, జొకోవిచ్‌తో పాటు ఇతర ఆటగాళ్లు ఎంతమంది వచ్చినా పారిస్ నుంచి ఉత్తచేతులతో వెనుదిరగాల్సిందే తప్ప ఆ టైటిల్ వంక చూసే ధైర్యం కూడా చేయలేదు. అలాంటి నాదల్ లేని ఫ్రెంచ్ ఓపెన్ ప్రేక్షకులకు తొలిసారి అనుభవంలోకి వస్తోంది. మరో ఏడాది మళ్లీ వస్తాడో? లేదో? అన్న మీమాంసలో.. మట్టికోర్టు మహారాజు నిష్క్రమణ అతడి అభిమానగణానికి తీరని శోకాన్ని మిగిల్చేదే.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.